


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
28 అక్టోబర్ 2024
పేజీలు: 02



## ఆరుగురు కెప్టెన్ల రిలీజ్?

ఐపీఎల్ 18 సీజన్ మెగా వేలానికి ముందు తమ కెప్టెన్లను వదులుకోవాలని ఆరు ఫ్రాంచైజీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో శిఖర్ ధవన్-పంజాబ్ కింగ్స్, డుప్లెసిస్-ఆర్సీబీ, రిషభ్ పంత్-ఢిల్లీ క్యాపిటల్స్, శ్రేయస్ అయ్యర్-కేకేఆర్, కేఎల్ రాహుల్-లక్నో, శుభ్‌మన్ గిల్-గుజరాత్ టైటాన్స్ ఉన్నట్లు సమాచారం. ఈ ఆరుగురు కెప్టెన్లలో శిఖర్ ధవన్ మినహా అందరూ వేలంలో పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## రీఛార్జ్ రేట్లు తగ్గింపు?

బీఎస్ఎన్ఎల్ దెబ్బకు ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు దిగొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. జులైలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా రీఛార్జ్ రేట్లను పెంచడంతో లక్షలాది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ కు మారుతున్నారు. దీంతో రేట్లను తగ్గించాలని ప్రైవేట్ కంపెనీలు భావిస్తున్నట్లు నేషనల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజును 8% నుంచి 0.5-1% తగ్గించాలని కోరుతున్నాయి. దీనిపై త్వరలో క్లారిటీ రానుంది.

## చైనాలో మూతపడుతున్న కిండర్‌గార్టెన్ స్కూళ్లు!

ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా నేడు జనాభా తగ్గుదలతో ఇక్కట్లు పడుతోంది. అక్కడ జననాల సంఖ్య భారీగా తగ్గిపోయి, వృద్ధుల సంఖ్య పెరుగుదల పెరిగింది. ఈ క్రమంలో పిల్లలు లేక ఎల్‌కేజీ, యూకేజీ పాఠశాలలు వేల సంఖ్యలో మూత పడుతున్నాయి. ఒకప్పుడు పిల్లలు వద్దంటూ నియంత్రించిన సర్కారే నేడు కనమని వేడుకుంటున్నా.. ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకోలేక చైనీయులు పిల్లల్ని కనడం లేదు.

## టెస్లా సీఎఫ్ఓతో మంత్రి లోకేశ్ భేటీ.. పెట్టుబడులపై చర్చ

ఏపీలో పెట్టుబడులపై టెస్లా సీఎఫ్ఓ వైభవ్ తనేజాతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. యూఎస్‌లోని ఆస్టిన్‌లో ఉన్న టెస్లా కేంద్ర కార్యాలయాన్ని లోకేశ్ సందర్శించారు. టెస్లా ఈవీ తయారీ, బ్యాటరీ ఉత్పత్తుల యూనిట్ల ఏర్పాటుకు అనంతపురం జిల్లా వ్యూహాత్మక ప్రదేశంగా ఉంటుందని చెప్పారు. 2029 నాటికి రాష్ట్రంలో 72జీడబ్ల్యూ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తే తమ లక్ష్యమని, దీనికి టెస్లా వంటి గ్లోబల్ కంపెనీ సహాయ, సహకారాలు అవసరమని పేర్కొన్నారు.




## హైదరాబాద్‌లో నెల రోజులు ఆంక్షలు.. ర్యాలీలు, ధర్నాలు నిషేధం

ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతో రాజధాని హైదరాబాద్ అట్టుకుతున్నది. రేవంత్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా, ఎన్నికల హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు సచివాలయాన్ని ముట్టడిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో పోలీసులు ఆంక్షలు విధించారు. నెలరోజుల పాటు ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అశాంతిని సృష్టించడానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం అందిందని, ఈ నేపథ్యంలో ఆంక్షలు విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమవారం నుంచి నవంబర్ 28 వరకు సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురికి మించి గుమికూడితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద ఆంక్షలు విధించినట్లు తెలిపారు. కాగా, ఏక్‌పోలీస్ విధానం అమలు, సస్పెండ్ చేసిన కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళన ఉధృతమైంది. యూనిఫాంలతో వచ్చి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు హైదరాబాద్‌లో ఆంక్షలు విధించారు.




## 31న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: టీటీడీ

తిరుమలలో దీపావళి ఆస్థానం దృష్ట్యా ఈనెల 31న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్టు టీటీడీ వెల్లడించింది. ఆలయానికి స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. ఈ నెల 30న సిఫార్సు లేఖలు స్వీకరించబోమని పేర్కొంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.




# జన్వాడ ఫామ్ హౌస్‌పై పొలిటికల్ ఫైట్

జన్వాడ ఫామ్ హౌస్ పార్టీపై పొలిటికల్ ఫైట్ పీక్ స్టేజ్‌కు చేరింది. ప్రధాన పార్టీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీ జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. సీసీ ఫుటేజ్ రిలీజ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అటు.. ఫ్యామిలీ పార్టీని రేవ్ పార్టీగా ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీజేపీపై బీఆర్ఎస్ భగ్గుమంది. ఇంతకీ.. జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగింది ఫ్యామిలీ పార్టీనా?.. రేవ్ పార్టీనా?.. అసలు.. మొత్తం ఎపిసోడ్‌పై పోలీసు ఎంక్వైరీలో ఏం తేలబోతోంది?..తెలంగాణ పాలిటిక్స్ ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటికే.. గత రెండు, మూడు రోజులుగా దీపావళి పండుగ వేళ పొలిటికల్ బాంబులు పేలతాయన్న మంత్రి పొంగులేటి కామెంట్స్ కాక రేపుతున్నాయి. అధికార, విపక్షాల మధ్య పొలిటికల్ బాంబులు టార్గెట్‌గా మాటలయుద్ధాలు నడుస్తున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయంలోనే సడెన్‌గా జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ ఇష్యూ తెరపైకి రావడం తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేగింది. దాంతో.. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు విరుచుకుపడ్డారు. డ్రగ్స్ కల్చర్‌కు వ్యతిరేకమని చెప్పిన బీఆర్ఎస్ నేతలు.. ఫామ్ హౌస్ పార్టీ వ్యవహారంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ప్లాన్ ప్రకారం ఫామ్ హౌస్ పార్టీని కాంగ్రెస్ నేతలు వివాదాస్పదంగా మార్చారని ఆరోపించారు మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. ఈ ఎపిసోడ్ మొత్తంలో పోలీసుల తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇక.. ఫామ్ హౌస్ పార్టీ అంశంలో రాజకీయాలకు అతీతంగా చట్టప్రకారం వ్యవహరించాలన్నారు టీ.బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి. ప్రభుత్వ పాలనతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు కక్ష సాధింపు చర్యలు దిగడం కాదని నిజాన్ని నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. జన్వాడ ఫామ్ హౌస్ వ్యవహారంలో సీరియస్‌గా ఎంక్వైరీ జరగాలన్నారు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్. ఫామ్ హౌస్‌లో ఏం జరిగిందో తేలాలంటే ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే.. ఫామ్ హౌస్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండించారు బీఆర్ఎస్ నేతలు. కొత్తగా ఇల్లు కట్టుకుని ఫ్యామిలీ పార్టీ చేసుకుంటే.. రేవ్ పార్టీ అని ప్రచారం చేస్తారా అని మండి పడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు చెప్తోన్న పొలిటికల్ బాంబులు ఇవేనా?.. అని ప్రశ్నించారు. మొత్తంగా.. జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. రేవ్ పార్టీ అని కాంగ్రెస్.. కాదు.. ఫ్యామిలీ పార్టీ అంటూ బీఆర్ఎస్.. మధ్యలో సీసీ ఫుటేజ్ రిలీజ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో.. అసలు.. ఫామ్‌హౌస్ పార్టీపై పోలీసులు ఏం తేలుస్తారో చూడాలి.



## పెళ్లాడి పిల్లల్ని కనాలని ఉంది

హీరోయిన్ రాశీఖన్నా తాజాగా తన పెళ్లి గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఓ ఈవెంట్ లో పాల్గొన్న రాశీ ఖన్నా తన మ్యారేజ్ ప్లాన్స్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేస్తూ.. 'నా పెళ్లి పై కొన్ని రూమర్స్ వినిపిస్తున్నాయి. అవి నిజం కాదు. ఐతే, నాకు పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలని ఉంది. కానీ నా పెళ్లికి ఇంకా సమయం ఉంది. అయినా, నా పెళ్లి అనేది నా పర్సనల్ మ్యాటర్. కాబట్టి ఇక్కడ దాని గురించి డిస్కస్ చేయాలనుకోవడం నాకు ఇష్టం లేదు' అంటూ రాశీఖన్నా తెలిపింది. రాశీఖన్నా తన ప్రొఫెషన్ గురించి కూడా మాట్లాడుతూ.. 'నా ప్రొఫెషన్‌తో నా వివాహాన్ని ముడిపెట్టాల్సిన అవసరం లేదని నేను నమ్ముతున్నాను' అని ఆమె చెప్పుకొచ్చింది. ఇక రాశీఖన్నా నటించిన 'సబర్మతి రిపోర్ట్' సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ మధ్య రాశీఖన్నా "బాక్" సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అరణ్మనై 5వ సినిమాని కూడా స్టార్ట్ చేస్తున్నట్టుగా, రాశీఖన్నా ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, వాటిలో నిజం లేదని మేకర్స్ క్లారిటీ ఇచ్చారు.



## ప్రజా పాలనలో దొంగలు.. దొంగలు కలిసి ఊళ్లు పంచుకుంటున్నారు

**వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు అక్రమార్కులతో చేతులు కలిపి ఇసుక దందా చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దొరికినకాడికి దోచుకో, అందినంత దండుకో అన్నట్లుగా దందా నడుస్తున్నదని విమర్శించారు. అక్రమార్కులు, కాంగ్రెస్ గ్యాంగులు కలిసి సహజ వనరులను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. చీకటి వాటాలు, సీక్రెట్ ఒప్పందాలు చేసుకుని యథేచ్ఛగా ఇసుకను, మట్టిని బుక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో దొంగలు, దొంగలు కలిసి ఊళ్లు పంచుకుంటున్నారని ఫైరయ్యారు. ఇది ఇసుకాసుర, బకాసుర, భస్మాసుర రాజ్యమన్నారు. తెలంగాణలో ఇప్పుడిదే దందా నడుస్తున్నదని ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు.
'దొరికినకాడికి దోచుకో.. అందినంత దండుకో !
తెలంగాణలో ఇప్పుడిదే దందా నడుస్తున్నది !
అక్రమార్కులు-కాంగ్రెస్ గ్యాంగ్‌లు చెట్టాపట్టాలేసుకొని సహజ వనరులను కొల్లగొడుతున్నారు..!
చీకటి వాటాలు.. సీక్రెట్ ఒప్పందాలు చేసుకొని యథేచ్ఛగా ఇసుకను మట్టిని బుక్కేస్తున్నారు..!
ప్రజా పాలనలో దొంగలు.. దొంగలు కలిసి ఊళ్లు పంచుకుంటున్నారు !
ఇసుకాసుర.. బకాసుర.. భస్మాసుర రాజ్యం ఇది..!' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మరికొన్నేళ్లు ఆటను ఆస్వాదిస్తా..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే గుర్తుకొచ్చే గొప్ప ఆటగాళ్ల జాబితాలో మహేంద్ర సింగ్ ధోనీ పేరు ముందు వరుసలో ఉంటుంది. తన ఆటతో, తన మేనియాతో ఐపీఎల్‌కు పిచ్చి క్రేజ్ తెచ్చాడు ఈ మిస్టర్ కూల్. అంతేనా చెన్నై సూపర్ కింగ్స్‌ను ఏకంగా ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన వీరుడు అతడు. అయితే.. 18వ సీజన్‌లో ధోనీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఒకవేళ ఆడినా అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతాడా? అందుకు బీసీసీఐ అనుమతిస్తుందా? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఒకింత ఆసక్తి రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలపై ధోనీ మౌనం వీడారు. సీఎస్‌కే అభిమానులకు గుడ్ న్యూస్ చెబుతూ.. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ఆడడంపై క్లారిటీ ఇచ్చేశారు.18వ సీజన్ మెగా వేలానికి ముందు ప్రతి జట్టు ఆరుగురిని మాత్రమే అట్టిపెట్టుకోవాలని బీసీసీఐ ఇప్పటికే ఫ్రాంచైజీలకు చెప్పింది. దాంతో, పలు జట్లు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలని భావిస్తున్నాయి. సీఎస్కే కూడా ధోనీ, జడేజా, గైక్వాడ్‌లను అట్టిపెట్టుకోనుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# పాక్ కొత్త కెప్టెన్ రిజ్వాన్

పాకిస్థాన్ పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా వికెట్ కీపర్-బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌ను నియమించారు. బాబర్ ఆజమ్ స్థానంలో వన్డే, టీ20 ఫార్మాట్ పగ్గాలను రిజ్వాన్‌కు అప్పగించారు. ఆస్ట్రేలియా, జింబాబ్వేలతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం జట్లను సెలెక్టర్లు ఆదివారం ఎంపిక చేశారు. కాగా, వచ్చే నెలలో ఆసీస్‌తో జరిగే వన్డే, టీ20ల జట్లలో బాబర్, షహీన్ అఫ్రీది, నసీమ్ షాలకు మళ్లీ చోటుదక్కింది. అయితే, వచ్చేనెల 24 నుంచి డిసెంబరు 5 వరకు జరిగే జింబాబ్వే టూర్‌కు రిజ్వాన్‌తోపాటు కొందరు సీనియర్లకు విశ్రాంతినిచ్చారు. దీంతో ఈ టూర్‌లో వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సల్మాన్ అగా జట్టును నడిపించనున్నాడు. 'బి' కేటగిరీకి అఫ్రీది: స్టార్ పేసర్ షహీన్ అఫ్రీదికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షాక్ ఇచ్చింది. ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్‌లో అఫ్రీదిని కేటగిరి-ఎ నుంచి తప్పించి.. గ్రేడ్-బిలో చేర్చింది. 2024-25 సీజన్‌కు సంబంధించి 25 మందికి సెంట్రల్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారు. ఫఖర్ జమాన్, ఇఫ్తికార్ అహ్మద్, ఒసామా మిర్‌లను ఆ జాబితా నుంచి తప్పించారు. పాక్ టెస్ట్ కెప్టెన్ షాన్ మసూద్ కేటగిరి-బిలోనే ఉన్నాడు.



# టీమిండియా హెడ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్

సౌతాఫ్రికాతో జరుగబోయే నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం టీమిండియా హెడ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ ఎంపికయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. రెగ్యులర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లనుండగా బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సౌతాఫ్రికా సిరీస్, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్‌లు క్లాష్ కానున్న నేపథ్యంలో టీమిండియాకు ఇద్దరు హెడ్ కోచ్‌లు అవసరమయ్యారు. తొలుత టీమిండియా షెడ్యూల్‌లో సౌతాఫ్రికా టీ20 సిరీస్ లేదు. ఈ మధ్యలో క్రికెట్ సౌతాఫ్రికా విన్నపం మేరకు బీసీసీఐ ఈ సిరీస్‌కు ఒప్పుకుంది. సౌతాఫ్రికా టీ20 సిరీస్ నవంబర్ 8, 10, 13, 15 తేదీల్లో జరుగనుండగా.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం భారత జట్టు నవంబర్ 10 లేదా 11 తేదీల్లో ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. సౌతాఫ్రికా టీ20 సిరీస్‌లో లక్ష్మణ్ సపోర్టింగ్ స్టాఫ్‌గా ఎన్‌సీఏ సభ్యులు సాయిరాజ్ బహుతులే, హృషికేశ్ కనిత్కర్, సుబదీప్ ఘోష్ ఉండే అవకాశం ఉంది. ఈ ముగ్గురు ఆసియా కప్ ఎమర్జింగ్ టోర్నీలో టీమిండియా కోచింగ్ సభ్యులుగా వ్యవహరించారు. కాగా, సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం 15 మంది సభ్యుల భారత బృందాన్ని అక్టోబర్ 25న ప్రకటించారు. ఈ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహించనున్నాడు. భారత టెస్ట్ జట్టులోకి సభ్యులెవరికీ ఈ జట్టులో చోటు దక్కలేదు. సౌతాఫ్రికా పర్యటన కోసం భారత జట్టు నవంబర్ 4న బయల్దేరి వెళ్లనుంది.

**సౌతాఫ్రికా టీ20 సిరీస్ కోసం భారత జట్టు..**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్‌కీపర్), రింకు సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్‌కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్‌కుమార్ వైషాక్, అవేష్ ఖాన్ , యష్ దయాళ్



# రాజకీయాల్లోకి విజయ్.. తమిళ హీరోల నుంచి విషెస్

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్.. విల్లుపురం సమీపంలో తన తమిళ వెట్రి కళగం పార్టీ మొదటి మహానాడు సభ నిర్వహించాడు. దీనికి దాదాపు ఎనిమిది లక్షల మందికి పైగా హాజరయ్యారని అంచనా. ఇందులో తన పార్టీ ఆలోచనలు, 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఏం చేయబోతున్నామో అనే విషయాల్ని విజయ్ చాలావరకు చెప్పకొచ్చారు. వన్ కమ్యూనిటీ, వన్ గాడ్ అనే సిద్ధాంతంతో తమ పార్టీ ముందుకు వెళ్తుందని క్లారిటీ ఇచ్చారు.ఇక రాజకీయంగా తొలి సభ పెట్టిన హీరో విజయ్‌కి తమిళ హీరోల నుంచి పూర్తిస్థాయిలో మద్ధతు లభించింది. శివకార్తికేయన్, విజయ్ సేతుపతి, జయం రవి, దర్శకులు నెల్సన్ దిలీప్ కుమార్, వెంకట్ ప్రభు, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, నటులు శశి కుమార్, వసంత్ రవి, కమెడియన్ సతీశ్, నిర్మాత అర్చన కళపతి.. ఇలా చాలామంది తమిళ సెలబ్రిటీలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి విజయ్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

# ప్రచారంలో ట్రంప్ జోష్

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్నారు.తాజాగా ఆదివారం(అక్టోబర్28) రాత్రి న్యూయార్క్‌లో జరిగిన మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ర్యాలీ వేదికపై భార్య మెలానియాతో కలిసి ట్రంప్ డ్యాన్సులు వేశారు. ర్యాలీలో అనూహ్యంగా ప్రత్యక్షమైన మెలానియా వేదికపైకి ట్రంప్ రాక ముందు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ట్రంప్ వేదికపైకి రాగానే ఆయనను కౌగిలించుకుని ముద్దుపెట్టుకుని సందడి చేశారు. సభలో డ్యాన్సులేయడంతో పాటు 'మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్' అని ట్రంప్ నినాదాలు చేశారు. కాగా, నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ట్రంప్ క్రేజ్ పెరుగుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. నెల రోజుల కిందట డెమొక్రాట్ అభ్యర్థి కమల హారిస్ కంటే వెనుకబడిన ట్రంప్ ఎన్నికల లేదీ దగ్గరవుతున్న కీలక సమయంలో పుంజుకోవడం రిపబ్లికన్లలో ఉత్సాహాన్ని నింపుతోంది.

# ఒక్క డీఏపై ఉద్యోగుల్లో అసంతృప్తి

పెండింగ్‌లో ఉన్న 5 డీఏల్లో ఒక్కటి మాత్రమే ప్రభుత్వం ఇస్తామని చెప్పడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇది తమను నిరాశకు గురిచేసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం లైట్ తీసుకుందని, సంఘాలు సైతం పోరాడలేదని ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపడం సరికాదని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున:పరిశీలించాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# ఢిల్లీలో అధ్వాన స్థితికి గాలి నాణ్యత



దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357 గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.



# ఏపీటీడీసీ ఎండీగా ఆమ్రపాలి

తెలంగాణ నుంచి ఇటీవల ఏపీ క్యాడర్‌కు వెళ్లిన ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ సీఎస్ నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమ్రపాలిని ఏపీ టూరిజం ఎండీగా ప్రభుత్వం నియమించింది. అలాగే ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగాను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్మికశాఖ ముఖ్యకార్యదర్శిగా వాణీ ప్రసాద్‌ను నియమించారు. కార్మికశాఖ అదనపు బాధ్యతల నుంచి ఎం.ఎం.నాయక్‌ను రిలీవ్ చేశారు. ఆరోగ్యం కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా వాకాటి కరుణను నియమించారు. జాతీయ హెల్త్ మిషన్ డైరెక్టర్‌గా వాకాటి కరుణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ జి.వాణిమోహన్‌ను బదిలీ చేసి.. సాధారణ పరిపాలన శాఖలో సర్వీసుల వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు చూస్తున్న పోల భాస్కర్‌ను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



# టెంపర్ లేపుతున్న రాశి సింగ్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ రాశీ సింగ్ చీరకట్టులో అందంతో మెరిశారు. హొయలు ఒలికించారు. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. టాలీవుడ్ హీరోయిన్ రాశీ సింగ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. తరచూ ఫొటోలను, వీడియోలను షేర్ చేస్తుంటారు. తాజాగా చీరకట్టులో తళుక్కుమన్న ఫొటోలను పంచుకున్నారు. గ్రీన్ కలర్ పట్టుచీరలో ఆకర్షణీయమైన లుక్‌తో ఆకట్టుకున్నారు రాశీ సింగ్. ట్రెడిషనల్ లుక్‌తో మరింత గ్లామరస్‌గా కనిపించారు.చీరకట్టులో అదిరే పొజులతో అందాలు ఒలికించారు రాశీ సింగ్. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.2019లో జెమ్ సినిమాతో టాలీవుడ్‌లో తెరంగేట్రం చేశారు రాశీ సింగ్. ఆది సాయికుమార్‌తో నటించిన శశి చిత్రంతో గుర్తింపు వచ్చింది. ప్రేమ్ కుమార్ మూవీలోనూ నటించారు. ఈ ఏడాది భూతద్ధం భాస్కర్ నారాయణ చిత్రంలో రాశీ సింగ్ హీరోయిన్‌గా నటించారు. సుహాస్ హీరోగా నటించిన ప్రసన్న వదనం చిత్రంలోనూ ఈ బ్యూటీ మెప్పించారు.